

వైద్య వృత్తిలో ఖ్యాతి పొందిన ఎల్లాప్రగడ

ప్రజాశక్తి-కల్చరల్

వైద్య వృత్తినే దైవారాధనగా భావించిన ఎల్లాప్రగడ సుబ్బారావు దేశంలోనే శస్త్ర చికిత్సల నిపుణుడుగా ఖ్యాతి పొందారని శాసనసభ తొలి సభాపతి ఎస్.మధుసూదనాచారి పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై శతాబ్ది పూర్వమహనీయులు యాది కార్యక్రమ పరంపరలో భాగంగా విఖ్యాత వైద్యుడు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు సంస్మరణ సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిధిగా మధుసూదనాచారి పాల్గొని మాట్లాడుతూ గోదావరి జిల్లాలో పేదల వైద్యునిగా సుబ్బారావు పెరుగడించారన్నారు. ఇలాంటి మహనీయుల జీవితాలు నేటి వారికి తెలియపరచాలని, అందువల్ల వారి నుంచి స్ఫూర్తిని పొంది సమాజంలో సేవ చేయడానికి మరింత మంది ముందుకు వస్తారని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళాజనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై జర్నలిస్టులు జయసూర్య, చంద్రశేఖర్, బేవరేజెస్ పూర్వ చైర్మన్ దేవి ప్రసాద్ పాల్గొన్నారు.

సాయన్న వివాదరహితుడు

ఆయన కుటుంబానికి అండగా ఉంటాం

- సంతాప తీర్మానంలో సిఎం కెసిఆర్
- సాయన్నకు అసెంబ్లీ నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే గడ్డం సాయన్న మృదు స్వభావి, వివాదరహితుడని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. నాలుగు దశాబ్దాలపాటు రాజకీయాల్లో ఉన్న సాయన్న.. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసిలో కలిపేందుకు చాలా ప్రయత్నం చేశారని, తాను సిఎం అయిన తర్వాత ఆయన విజ్ఞప్తితో అనేకసార్లు లేఖలు కూడా రాశానని కెసిఆర్ గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ సమావేశమైన వెంటనే స్పీకర్ అనుమతితో సిఎం కెసిఆర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో శాసన సభ్యుడిగా, హుడా డైరెక్టర్‌గా, టిటిడి పాలక మండలి సభ్యుడిగా, ఇతర అనేక హోదాల్లో సాయన్న పని చేశారన్నారు. ఆయనతో తనకు వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉందని సిఎం చెప్పారు. ఎటువంటి సందర్భంలోనైనా చిరునవ్వుతో చాలా ఓపికతో ఉండేవారని, అందరితో కలుపుగోలుగా ఉండేవారని సిఎం గుర్తు చేసుకున్నారన్నారు. కంటోన్మెంట్ ప్రజల కోసం చాలా తపనపడేవారన్నారు. కంటోన్మెంట్లను నగరపాలికల్లో కలపాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆ రకంగానైనా సాయన్న కోరిక నెరవేరాలని కోరుకుంటున్నానని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో జన్మించిన సాయన్న.. హైదరాబాద్‌లో స్థిరపడి వ్యాపారవేత్తగా ఉంటూ 1983లో రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ఆయన కూతురు లాస్యనందిత సైతం జిహెచ్ఎంసి కార్పొరేటర్‌గా సేవలందించిందన్నారు. సాయన్న లేని లోటు తీరనిదన్నారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని సిఎం పేర్కొన్నారు. సిఎం ప్రవేశపెట్టిన సంతాప తీర్మానంపై మంత్రులు ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, ఎంఐఎం సభ్యులు సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క, బిజెపి సభ్యులు రఘునందన్‌రావు, బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడారు. సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ సాయన్న సేవలను కొనియాడారు. సాయన్న మృతి పట్ల సభ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించింది. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే విజయరామారావు మృతి పట్ల సభ సంతాపం ప్రకటించింది. అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS: GUNTUR
DISPUTE No. 120 of 2022

Between:-
M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Station Road, Tenali ...Disputant
and
Mr.N.Ramesh and Others ...Opponents

OPPONENT-4
Mr.Nimmagadda Subba Rao, S/o Venkateswarlu, Sr.Software Engineer, Nisum Consulting P Ltd., Telecom Nagar, Gachibowli, Hyderabad.

Whereas the above named Disputant filed the above Dispute against you for recovery of a sum of Rs.57,977.00 for notice of you that you are hereby required to appear before the Deputy Registrar of Chits, Guntur on 08-08-2023 at 10.00 a.m. either personally of through an advocate and for your defence/objections. If you fail to attend the office of the Deputy Registrar of Chits on that day the matter will be heard and decided exparty basis on the material available.
(By order of the Deputy Registrar of Chits)

B M S D PRASAD,
ADVOCATE,
TENALI.

మరణించినా అవయవదానంతో జీవించే అవకాశం

- దేశంలోనే తొలి స్థానంలో రాష్ట్రం
- వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- అవయవదాతల కుటుంబీకులకు సన్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి శరీర అవయవాలు ఎనిమిది మందికి ప్రాణం పోస్తాయని ఆ రకంగా మరణించి కూడా జీవించే అవకాశం అవయవదానంతో సాధ్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అవయవ దానం పట్ల కొందరిలో ఇంకా అపోహలు, మూఢ నమ్మకాలు ఉన్నాయని, ఎలాంటి సంశయం అవసరం లేదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జీవన్‌దాన్ నిర్వహణలో 13వ జాతీయ అవయవదాన దినోత్సవం కార్యక్రమం గురువారం హైదరాబాద్ రవీంద్రభారతి ప్రధాన వేదికపై జరిగింది. ఈ సందర్భంగా అవయవ దాతల కుటుంబ సభ్యులు 105 మందిని మంత్రి సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అవయవ దానంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో ఉందని, ఇది మనందరికీ గర్వకారణం అన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందన్నారు. అధిక ధూమపానం, మద్యపానం వల్ల లివర్, కిడ్నీ, సమస్యలు వస్తాయని చెప్పారు. జీవన శైలిలో యోగ, శారీరక వ్యాయామం వల్ల రక్తపోటు, చెక్కర వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని, శరీరాన్ని, గుండెను కాపాడుకోవచ్చని అన్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం నిబద్ధతతో ఉందన్నారు. ఏ అనారోగ్య సమస్యకైనా ప్రభుత్వ వైద్యశాలలో ఉత్తమ చికిత్స లభిస్తుందని తెలిపారు. వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ఉచితంగా కిడ్నీ, లివర్, హార్ట్, లంగ్స్ అవయవ మార్పిడికి అనుమతిచ్చిందన్నారు. అవయవ మార్పిడిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు జీవన్ దాన్ ద్వారా చేపట్టామని తెలిపారు. 2013 నుంచి ఇప్పటి వరకు 4829 వివిధ అవయవాల మార్పిడి జరిగిందని వివరించారు. వివిధ అవయవ మార్పిడీల కోసం 3089 మంది వేచి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి మహమూద్ అలీ, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ వాణీదేవి, కార్పొరేటర్ విజయారెడ్డి, ఉస్మానియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, గాంధీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం వరకే అసెంబ్లీ..?

- బిఎసిలో స్పష్టం చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ వర్షాకాల శాసనసభ సమావేశాలు ఆదివారం వరకే జరిగే అవకాశం ఉంది. ఈ మేరకు బిఎసిలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సభావ్యవహారాల సలహా సంఘం (బిఎసి) గురువారం సమావేశమైంది. ఉపసభాపతి పద్మారావుగౌడ్, మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్ భాస్కర్, మజ్లిస్, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతలు అక్బరుద్దీన్ ఒవైసీ, మల్లు భట్టి విక్రమార్క సమావేశంలో పాల్గొన్నారు. మూడు, నాలుగు రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయని, అన్నింటినీ చర్చించేందుకు వీలుగా అసెంబ్లీ సమావేశాలు 20 రోజులపాటు నిర్వహించాలని సిఎల్పీ నేత భట్టి విక్రమార్క కోరారు. మంత్రి హరీశ్ రావు స్పందిస్తూ, ఎన్నిరోజులు నిర్వహించారన్నది ముఖ్యం కాదు.. ఎన్నిగంటల పాటు సమావేశమైంది, ఎంత మంచి చర్చ జరిగిందన్నది ముఖ్యమని ఆయన వ్యాఖ్యానించారు. సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలను బిఆర్ఎస్, మజ్లిస్, కాంగ్రెస్ సభాపతికి అందించాయి. భారీ వర్షాలు, వరదలు, ప్రభుత్వ చర్యలు.. సంక్షేమ పథకాలపై సభలో చర్చించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశాల్లో దాదాపు 10 బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గవర్నర్ వెనక్కు పంపిన నాలుగు బిల్లులతో పాటు ఆర్‌టిసి ఉద్యోగులు, టిమ్స్ ఆసుపత్రులు, జిఎస్‌టి చట్ట సవరణ, కార్మికశాఖకు సంబంధించిన బాయిలర్స్ చట్ట సవరణ బిల్లులు సభలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

ఇంటి గోడ కూలి ముగ్గురు మృతి

నాగారం మండల కేంద్రంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలకు తడిసి ముద్దయిన ఇంటి గోడ అర్ధరాత్రి నిద్రిస్తున్న కుటుంబీకులపై కూలింది. దాంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మట్టి కింద ప్రాణం వదిలారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నాగారం మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

నాగారం గ్రామ చివరిలో ఉన్న శీలం రాములు (90) ఇంటి గోడలు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో బాగా తడిశాయి. బుధవారం రాత్రి కూడా వర్షం కురిసింది. రాములు, భార్య శీలం రాములమ్మ(70), కొడుకు శీలం శ్రీను(35) ఇంట్లో నిద్రిస్తుండగా మధ్య గోడ కూలిపోయి వారి మీద పడింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. గురువారం ఉదయం కరెంట్ రీడింగ్ బిల్లు కోసం వెళ్లిన విద్యుత్ శాఖ సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. నాగారం తహశీల్దార్ బ్రహ్మయ్య, సిఐ శివశంకర్, ఎస్ఐ ముత్తయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను వెలికితీసి తుంగతుర్తి ఏరాయి ఆస్పత్రికి తరలించారు. తహశీల్దార్ బ్రహ్మయ్య పంచనామా నిర్వహించారు. మృతుడు శ్రీనుకు ఇద్దరు కుమారులు, కూతురు, భార్య ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టు
అమలాపురం
O.S. No 9/10

Between
బాలనాగు అనంతలక్ష్మి వెంకట సత్యవతి ...వాది
And
గుర్రం వెంకట సూర్యప్రకాష రావు (Died) మరియు వగైరాలు ప్రతివాది

5వ ప్రతివాది
Borusu Sarada, W/o B.G.Varma, Plot No.32, Trumalgherry, Near A.O.C Center, Secundrabad, T.S.

6వ ప్రతివాది
Gurram sai Harish Prasanth, S/o G.S. Krishna, Flot No.305, Bhagavan Budha Shila Rida Apartment. Near Financial colony, Hyderabad-2, Telangana state.

పై నెం. దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తూ ఉండటం వలన శ్రీ కోర్టు వారు 5,6వ ప్రతివాదులైన మీకు నోటీసు ఆర్డరు వేసినారు. మీరు **ది.16-8-2023వ** తేదీ న ఉదయం **10:30** గంటలకు మీరు ప్రత్యక్షంగా గాని లాయరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరు అయ్యి మీకు ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపగలరు.లేనిచో మీ పరోక్షమున కేసు కొట్టి వేయుదురు

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

జి.వి.వి.ఎస్.గుప్తా
అడ్వకేట్
అమలాపురం
సెల్ 9849470531

01/08/2023
అమలాపురం

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తాం

డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి మంత్రి కెటిఆర్ హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని రాష్ట్ర మంత్రి కె.తారకరామారావు హామీ ఇచ్చారు. ఈ అంశం ముఖ్యమంత్రి కెసిఆర్ పరిశీలనలో ఉందని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గురువారం మంత్రి కెటిఆర్‌ను డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డిజెహెచ్ఎస్) అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని వారు కెటిఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డిజెహెచ్ఎస్ గురించి అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ తుదివిడత కౌన్సెలింగ్

- 6 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎంసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ప్రాథమిక సమాచారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండడంతోపాటు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకునే అవకాశముందని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ఈనెల ఐదున ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఈనెల ఆరు వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని వివరించారు. తొమ్మిదో తేదీ నాటికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు https://tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఐఆర్ ఎంతిద్దాం..!

- ఆర్థిక శాఖ అధికారులతో కెసిఆర్ సమాలోచన
- 14 శాతం లోపు ప్రకటించే అవకాశం
- నేడో, రేపో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- పిఆర్‌సి కమిటీ ఏర్పాటుకు సిఎం అంగీకారం
- ముఖ్యమంత్రికి ఉద్యోగ జెఎసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు వేతన సవరణ కమిషన్ (పిఆర్‌సి) కమిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి కెసిఆర్ అంగీకరించారు. మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించాలని నిర్ణయించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలుకు సానుకూలత వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐఆర్ ఎంత ప్రకటిస్తారన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. అయితే ఐఆర్ ఎంత ప్రకటించాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఆర్థిక శాఖ అధికారులతో సిఎం కెసిఆర్ ఐఆర్ ఎంత ఇస్తే రాష్ట్ర ఖజానాపై ఎంత భారం పడుతుందన్న సమాలోచన చేస్తున్నారు. తెలంగాణ తొలి పిఆర్‌సిలో ఐఆర్ లేకుండానే నేరుగా 30 శాతం ఫిట్‌మెంట్‌ను సిఎం ప్రకటించారు. కానీ ఈసారి ఐఆర్‌ను ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. అందుకే ఐఆర్ ఎంతివ్వాలన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇంకోవైపు ఉద్యోగులు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్‌కు ఇప్పుడు నెలకు రూ.నాలుగు వేల కోట్లు ఖర్చవుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, రాబడి, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అయ్యే ఖర్చును కూడా అంచనా వేయాల్సి ఉంటుంది. మరోవైపు సిఎం కెసిఆర్ ఇటీవలే ప్రకటించిన బిసిలకు రూ.లక్ష, మైనార్టీలకు రూ.లక్ష సాయంతోపాటు రైతు రుణమాఫీకి రూ.20 వేల కోట్ల వరకు ఖర్చు కానుంది. ఈ నేపథ్యంలో ఐఆర్ ఎంతివ్వాలనే దానిపై ఆర్థిక శాఖ అధికారులతో సీఎం సంప్రదింపులు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని సిఎం నిర్ణయాన్ని ప్రకటించే అవకాశమున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 14 శాతంలోపు ఐఆర్ ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక శాతం ఐఆర్ ఇస్తే రూ.30 కోట్లు ప్రభుత్వం అదనంగా భరించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.360 కోట్లవుతాయి. ఈ లెక్కన ఐదు శాతానికి నెలకు రూ.150 కోట్లు, ఏడాదికి రూ.1,800 కోట్లు, ఎనిమిది శాతానికి నెలకు రూ.240 కోట్లు, ఏడాదికి రూ.2,880 కోట్లు, పది శాతానికి నెలకు రూ.300 కోట్లు, ఏడాదికి రూ.3,600 కోట్లు, 12 శాతానికి నెలకు రూ.360 కోట్లు, ఏడాదికి రూ.4,320 కోట్లు, 14 శాతానికి నెలకు రూ.420 కోట్లు, ఏడాదికి రూ.5,040 కోట్లు ఖర్చవుతాయి. అయితే తెలంగాణ మొదటి పీఆర్సీ గడువు జూన్ 30తో ముగిసింది. రెండో పిఆర్‌సి ప్రకారం గతనెల ఒకటో తేదీ నుంచి కొత్త వేతనాలను ఉద్యోగులు తీసుకోవాలి. కానీ పీఆర్సీ కమిటీని ప్రభుత్వం నియమించలేదు. అయితే పిఆర్‌సి ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం కసరత్తును ప్రారంభించినట్టు సమాచారం. సీనియర్ ఐఎఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తున్నారు. శుక్ర లేదా శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి కెసిఆర్ సమావేశమయ్యే అవకాశమున్నది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పటికే బాగాలేదు, ఉద్యోగులకు జీతాలు, సంక్షేమ కార్యక్రమాలు, దళితబంధు, బిసి, మైనార్టీలకు రూ.లక్ష సాయం, ఇప్పుడు రుణమాఫీకి నిధులు ఎక్కడి తేవాలన్న చర్చ జరుగుతున్నది. అయినా సిఎం ఐఆర్ ప్రకటిస్తే ఆ నిధులను ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై ఆర్థిక శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నట్టు సమాచారం.

జులై నుంచే ఐఆర్ అమలు చేయాలి : ఉద్యోగ జేఏసీ

రెండో పిఆర్‌సిని గతనెల ఒకటో తేదీ నుంచి అమలయ్యేలా ఐఆర్ ప్రకటించాలని తెలంగాణ ఉద్యోగ జెఎసి కోరింది. ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఉద్యోగ జెఎసి చైర్మన్ ఎం రాజేందర్, సెక్రెటరీ జనరల్ వి మమత నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం చందాతో కూడిన ట్రస్టును ఏర్పాటు చేసి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలను అందేలా ఈహెచ్ఎస్‌ను ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిపిఎస్‌ను రద్దు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. గోపన్‌పల్లిలోని సర్వే నెంబర్ 36,37లో గతంలో ఉద్యోగులకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని భాగ్యనగర్ ఎన్‌జిఒ హౌజింగ్ సొసైటీకి అప్పగిస్తూ ఉత్తర్వులివ్వాలని సూచించారు. ఉద్యోగులకు సంబంధించిన ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారం చేస్తామంటూ సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, టిజిఒ ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, బిటిఎన్‌జిఒ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT :: HYDERABAD, TELANGANA
O.S.NO. **542** OF **2019**

Between :
M/s. Aurobindo Pharma Ltd. ... Plaintiff
AND
Mutyala Sai Narayana & Others ... Defendants

To,
1. Chegondi Venkata Prasad S/o. Chegondi V.V. Subbharao Plot No 197, Near UMCC Hospital, Shapoor Nagar, Quthbullapur, Jeedimetla, Hyderabad-500 055.
... Defendant No.3

Whereas the plaintiff Company filed the above suit against you for recovery of damages / money. The above suit is posted to **29-08-2023** for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at **10:30** a.m. on the above said date before the Hon'ble Court, failling which the suit will be heard and determined exparte.

(By Order of the Hon'ble Court)

K. Venugopal Reddy
K. Narasimha Reddy
Advocates
4-92/2/A, Ist Floor, Chandanagar, Hyderabad - 500 050

ఎఫ్ఆర్ఒ హత్య నిందితులకు జీవిత ఖైదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు హత్య కేసులో నిందితులకు కోర్టు శిక్ష విధించింది. ఇద్దరు నిందితులు మడకం తులా, పోడియం నంగాలను దోషులుగా తేలుస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ పాటిల్ వసంత్ గురువారం తీర్పు ప్రకటించారు. ఎఫ్ఆర్ఒను విచక్షణారహితంగా నరికి చంపిన ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం, ఎర్రబోడు గుత్తికోయ గ్రామ శివార్లలో గత సంవత్సరం నవంబర్ 22వ తేదీన విధులలో ఉన్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావును మడకం తులా, పోడియం నంగాలు నరికిచంపారు.

నిందితులపై చంద్రుగొండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువుకావడంతో కోర్టు శిక్ష ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనాత్మకమైన ఈ కేసులోని నిందితులకు త్వరితగతిన శిక్ష పడే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేశారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌వి వినీత్ అన్నారు. నేరం చేసిన వారికి చట్టపరంగా ఖచ్చితంగా శిక్ష పడుతుందని చెప్పారు.

ఎస్‌సి, ఎస్‌టి, గౌడలకు 786 మద్యం దుకాణాలు

- నేడు నోటిఫికేషన్
- ఈనెల 21న లాటరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2023-24, 2024-25 రెండేండ్లకు గాను మద్యం దుకాణాల లైసెన్స్‌ల కోసం ఆబ్కారీ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీచేయనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఎస్‌సి, ఎస్‌టి, గౌడ కులస్తులకు 786 షాపులను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో గుర్తించి కేటాయించారు. వీటిలో గౌడ కులస్తులకు 393, ఎస్‌సిలకు 262, ఎస్‌టిలకు 131 కేటాయించారు. ఎస్‌టిలకు కేటాయించిన వాటిలో 95 దుకాణాలు షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయి. నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనులకు 36 దుకాణాలను కేటాయించారు. మిగిలిన 1834 మద్యం షాపుల లైసెన్స్‌ల కోసం నోటిఫికేషన్ జారీచేయడంతోపాటు దరఖాస్తులను స్వీకరించనున్నారు. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా దరఖాస్తు ఫీజును రూ. రెండు లక్షలుగానే నిర్ణయించారు.

IN THE COURT OF HON'BLE IX ADDL, CHIEF JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD
O.P.No. 160 of 2020

BETWEEN:
Sudabathula Kanakadurga and another ...Petitioners
V/s
Dubbudu Sneha Reddy and others ...Respondents

To,
R-1
Dubbudu Sneha Rdddy, D/o Madhusudan Reddy, Ageda about Major, (Owner of the crime vehicle car bearing No. TS. 08. GQ.4484)/ R/o. Plot No, 8/220, Vihari Homes, Nava Durga Nagar, Yemnampet, Ghatkesar, Medchal.

Please take notice that the petitioners herein has filed the above O.P.No. 160 of 2020, Claiming compensation against you and others. The said casre is posted to **12-09-2020** for your appearance either in person or through an Advocte. If fialed to appear before the Hon'ble Court the said date at 10.30 A.Mx the matter will be heard and decide exparte

(BY ORDER OF THE COURT)
M.VENKATAIAH
ADVOCATE
O/o Sree Nilayam, 1st floor,H.No. 3-10-10/A, Gokhale Nagar, Library Lane, Ramanthpur,Hyderabad.
Mobile No. 98482 55392

రేషన్ డీలర్ల సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తా

- మంత్రి గంగుల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేషన్ డీలర్ల సమస్యలను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన రేషన్ డీలర్ల జెఎసి ప్రతినిధులతో సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయా ప్రతినిధులు మాట్లాడుతూ రేషన్ పోర్టబులిటీ తదితర కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ డీలర్లు గణనీయంగా ఆదాయాన్ని కోల్పోయారని తెలిపారు. వారికి గౌరవప్రదమైన కమిషన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ, మున్సిపల్, కార్పోరేషన్ పరిధిల్లోని రేషన్ డీలర్లకు సమన్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.

ప్రతిపక్షాలవి బురద రాజకీయాలు

- మండలిలో మంత్రి వేముల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయని ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రస్తుతం బురద రాజకీయం చేస్తున్నారని రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో అత్యధిక వర్షపాత పర్యవసనాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై గురువారం మండలిలో లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రశాంత్ రెడ్డి సమాధానమిస్తూ, సిఎం కెసిఆర్ ఫోటోలకు ఫోజులిచ్చే నాయకుడు కాదనీ, అలాంటి నాయకులు దేశంలో చాలా మంది ఉన్నారని ఎద్దేవా చేశారు. అంతా తామే అన్నట్టు ఫోటోలకు ఫోజులిస్తూ ఇంకో మనిషిని ముందుకు రానియ్యరని పరోక్షంగా ప్రధాని మోడీని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఊహించని విపత్తు సంభవించిందనీ, అయినప్పటికీ వెంటనే సిఎం కెసిఆర్ రాత్రింబవళ్లు ప్రజా ప్రతినిధులు, అధికారులను అప్రమత్తం చేస్తూ, తన పర్యవేక్షణతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించారని తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సిఎం సమీక్షించి, వెంట వెంటనే పలు సూచనలు చేశారని గుర్తుచేశారు.

అందుకే మోరంచపల్లికి వెళ్లలేదు

మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పని చేస్తుంటే అన్ని చోట్ల సహాయ చర్యలను సిఎం అనుసంధానించి విలువైన సూచనలు ఇచ్చారని మంత్రి తెలిపారు. సిఎం మోరంచపల్లికి వెళితే అక్కడి జిల్లా యంత్రాంగమంతా అక్కడికి వెళ్లాల్సి వచ్చేదనీ, ఆ పరిస్థితి రాకూడదనే ఆయన వెళ్లలేదని వివరించారు. నల్లగొండ జిల్లా తప్ప రాష్ట్రమంతా అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం ప్రజల ప్రాణాలను కాపాడిందని తెలిపారు. రాష్ట్రంలో 40 వేల చెరువులున్నాయనీ, ఆ పథకమే లేకుంటే వరద ప్రవాహంతో 30 నుంచి 40 శాతం చెరువులకు గండ్లు పడేవని వివరించారు. 756 చెరువులకు మాత్రమే గండి పడ్డాయనీ, వాటిలో ఇప్పటికే 76 చెరువుల పునరుద్ధరణ పూర్తయిందని తెలిపారు. వెయ్యికిపైగా స్థలాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతింటే యుద్ధ ప్రాతిపదికన వాటిని బాగు చేసినట్టు తెలిపారు.

"ఊరుకో" పరీక్ష

- గురుకుల పోస్టుల పరీక్షల్లో గందరగోళం
- వందల కి.మీ తిరగలేక పలువురు ఎగ్జామ్స్‌కు దూరం
- టిజిటి, పిజిటి, జెఎల్, డిఎల్‌లో కొన్నింటికే హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లికి చెందిన అరుణకుమారి ఒంగోలులో అత్తారింట్లో ఉంటోంది. రెండునెలల చిన్నారికి తల్లయిన ఆమె ఈ పరీక్షల కోసం టేకులపల్లి వచ్చింది. టిజిటి, పిజిటి పోస్టులకు అప్లై చేసిన ఆమెకు హైదరాబాద్‌లో ఒక సెంటర్, మరో ఐదు పేపర్లకు సత్తుపల్లిలో కేంద్రాలను కేటాయించడంతో పరీక్షలకు వెళ్లలేక.. విరమించుకుంటున్నట్టు 'నవతెలంగాణ'కు తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన రమాదేవికి 4వ తేదీన టిజిటి పరీక్ష మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మల్లాపూర్‌లో ఎగ్జామ్ ఉండగా 9న మేడ్చల్ జిల్లా మౌలాలిలో పిజిటి ఉంది. ఆ తర్వాత 10న రంగారెడ్డి జిల్లా తట్టిఅన్నారంలో పిజిటి మరో పేపర్, 14న టిజిటి భాగ్యలతా నగర్, రంగారెడ్డి జిల్లా, 16న డిగ్రీ లెక్చరర్ (డీఎల్) కరీంనగర్‌లో, 19న జూనియర్ లెక్చరర్ (జేఎల్) ఓల్డ్ అల్వాల్, మేడ్చల్ జిల్లా, 21న మళ్లీ పిజిటి మూడో పేపర్ నాచారం, తిరిగి టిజిటి చివరి పేపర్ 22న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో ఉండటంతో ఇద్దరు పిల్లల తల్లైన ఆమె.. ఇన్ని సెంటర్లు తిరగలేక, ఎగ్జామ్స్ అన్నీ ఓ క్రమపద్ధతిలో లేకపోవడంతో టిజిటి, పిజిటి, జెఎల్ పోస్టులకు మాత్రమే పరీక్షలు రాసి మిగిలిన డిఎల్ పరీక్షను విరమించుకోవాలని భావిస్తోంది. లేదంటే టీజీటీ, పీజీటీకే పరిమితం కావాలనుకుంటోంది.

ఖమ్మానికి చెందిన బిందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లిలోని వేర్వేరు కేంద్రాల్లో ఎగ్జామ్ సెంటర్స్ పడడంతో అన్ని పరీక్షలకు హాజరుకావడం కష్టమేనంటోంది. ఇలా రాష్ట్రంలో అనేక మంది అభ్యర్థులు అర్హతుండి, దరఖాస్తు చేసినా క్రమపద్ధతిలో లేని ఎగ్జామ్స్, వేర్వేరు ప్రాంతాల్లో సెంటర్ల మూలంగా పలు పోస్టుల పరీక్షలకు దూరమవుతున్న దుస్థితి ఉంది. రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో 9,210 పోస్టుల భర్తీ కోసం 'తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్ బోర్డు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొత్తం 9 రకాల పోస్టులకు పరీక్షలు..ఆగస్టు 1 నుంచి ప్రారంభమై 23వ తేదీతో ముగుస్తాయి. టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ ఎగ్జామ్స్, పీడీ, ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ తదితర పరీక్షల్లో.. పదో తరగతి అర్హతతో నిర్వహించే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మినహా మిగిలిన అన్ని పోస్టులకు మూడు పేపర్ల చొప్పున ఉంటాయి. పీజీ, బీఎడ్ చేసి టెట్, సెట్, నెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు నాలుగు పోస్టులకు అర్హులు. ఇలాంటి వారు జనరల్ స్టడీస్ కామన్ ఎగ్జామ్ ఒకటి రాస్తే సరిపోతుంది. మిగిలిన పోస్టుల కోసం రెండేసి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అంటే ఈ నాలుగు పోస్టులకు అర్హత ఉన్న ఒక్కో అభ్యర్థి తొమ్మిదికి పైగా పరీక్షలు రాయాల్సి వస్తుంది. అన్నీ ఆన్‌లైన్ విధానం కావడంతో పరీక్ష కేంద్రాల కేటాయింపు గందరగోళంగా మారింది.

అర్హతున్నా.. అప్లై చేసినా.. పరీక్షలకు దూరం..

అన్ని అర్హతలుండి, అప్లై చేసినప్పటికీ ఊరుకో ఎగ్జామ్ సెంటర్ పడటంతో పలువురు ఈ పరీక్షల్లో కొన్నింటికి దూరం అవుతున్నారు. ఈ పరీక్షలన్నీ ఒకేచోట, టీజీటీ తర్వాత పీజీటీ, ఆ తర్వాత జేఎల్, డీఎల్ ఉంటే పర్వాలేదు. కానీ కలగూర గంపలాగా రాష్ట్రంలోని పట్టణాలకో సెంటర్ చొప్పున కేటాయించడంతో ముఖ్యంగా మహిళా అభ్యర్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితి ఉంది. దాంతో కొందరు టీజీటీ, పీజీటీ ఎగ్జామ్స్ రాసి, జేఎల్, డీఎల్ పరీక్షలను విరమించుకుంటున్నారు. మరికొందరు జేఎల్, డీఎల్ పరీక్షలకు హాజరై పీజీటీ, టీజీటీ రాయడం మానేస్తున్నారు. పరీక్షా కేంద్రాల దూరభారంతో పిల్లల తల్లులు, గర్భిణులు పలువురు మొత్తానికే పరీక్షలకు దూరమవుతున్నారు. దాంతో పరీక్షా విధానంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఎందుకిలా.. ప్రత్యామ్నాయం లేదా..??

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగుల మెప్పు పొందాలనే తలంపుతో ప్రభుత్వం ఈ విపరీత చర్యకు దిగినట్టు అభ్యర్థుల నుంచి విమర్శలు వస్తున్నాయి. పలువురు గురుకుల బోర్డు కన్వీనర్ డాక్టర్ మల్లయ్య బట్టుకు ఫోన్ చేస్తున్న ఉదంతాలూ ఉన్నాయి. ఎవరు ఫోన్ ఆన్సర్ చేస్తే వారితో తమ ఆవేదన చెబుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మొత్తంగా 150 సెషన్స్‌లో నిర్వహించాల్సిన ఈ ఎగ్జామ్స్‌ను రోజుకు మూడు సెషన్స్ చొప్పున 50 సెషన్స్‌లో నిర్వహిస్తుండటం వల్లనే ఈ సమస్య వచ్చిపడినట్టు అభ్యర్థులు చెబుతున్నారు. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ పరీక్షల విషయంలో అబాసుపాలైన ప్రభుత్వం గురుకుల పోస్టుల భర్తీలోనూ అబాసుపాలవుతోంది. మొన్న నిర్వహించిన ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పరీక్ష తెలుగులో నిర్వహించాల్సి ఉండగా ఇంగ్లీష్‌లో పెట్టి విమర్శల పాలైంది.

'జై కిసాన్' మా విధానం

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అంటే భారత రైతు సమితి అని మరోసారి రుజువైందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. జై కిసాన్ అనేది తమకు కేవలం ఓ నినాదం కాదని, తమ ప్రభుత్వ విధానం అని తేలిపోయిందని చెప్పారు. కేంద్రం అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం తగ్గినా, బిజెపి సర్కారు అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు సృష్టించినా, రైతు రుణమాఫీని సంపూర్ణంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం.. ముఖ్యమంత్రి కెసిఆర్ సంకల్ప బలానికి నిలువెత్తు నిదర్శనమని వెల్లడించారు. రైతు సంక్షేమంలో తొమ్మిదేండ్ల తెలంగాణ ప్రస్థానం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని చెప్పారు. రైతుకు రక్షణ కవచంగా అమలు చేసిన ప్రతి పథకం వ్యవసాయ రంగ చరిత్రపై చెరగని సంతకమన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయం అంటే సంక్షోభం.. కానీ, ఒక్క తెలంగాణలోనే వ్యవసాయం అంటే సంతోషమని పేర్కొన్నారు. యావత్ తెలంగాణ రైతాంగం ముక్తకంఠంతో చేస్తున్న నినాదమిదని సోషల్ మీడియా వేదికగా కెటిఆర్ స్పష్టం చేశారు.

పవన్ ముంజల్ ఇంట్లో అనధికార విదేశీ కరెన్సీ లభ్యం..!

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటో కార్ప్ అధినేత పవన్ కుమార్ ముంజల్ నివాసాల్లో అనధికార విదేశీ కరెన్సీ, పసిడి, వజ్రాభరణాలు లభ్యం అయ్యాయి. బినామి కంపెనీలతో లావాదేవీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు రెండు రోజుల పాటు ముంజల్ నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. ఈ సోదాల్లో రూ.25 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ, బంగారం, వజ్రాభరణాలను అధికారులు జప్తు చేశారు. బుధవారం జరిపిన తనిఖీల్లో లభించిన పత్రాలకు సరైన ఆధారాలు లేవని ఇడి అధికారులు తెలిపారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ), కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల బోర్డు (సిబిఐసి) ఫిర్యాదు ఆధారంగా మానీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని వివిధ సెక్షన్ల కింద హీరో మోటో ఛైర్మన్, సహా ఉన్నతాధికారులపై ఇడి కేసులు నమోదు చేసింది. 2014-15 నుంచి 2018-19 మధ్య సాల్ట్ ఎక్స్‌పీరియన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో వివిధ దేశాలకు రూ.54 కోట్ల విలువైన విదేశీ కరెన్సీ చట్టవిరుద్ధంగా ఎగుమతి చేశారని ఇడి గుర్తించింది. ఈ మొత్తం పవన్ కుమార్ ముంజాల్ వ్యక్తిగత ఖర్చుల కింద చూపారని ఆరోపణ.

భారత రేటింగ్‌ను పెంచిన మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ : భారత రేటింగ్‌ను మెరుగుపర్చినట్లు మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థల రేటింగ్‌లలో ఈ సంస్థ పలు కీలక మార్పులు చేసింది. భారత్ రేటింగ్‌ను మరింత మెరుగుపర్చి 'ఓవర్‌వెయిట్'గా నిర్ణయించినట్లు తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల అజెండా మూలధన వ్యయాలు, లాభాల విషయంలో సానుకూల దృక్పథంలో ఉన్నాయని పేర్కొంది. చైనా రేటింగ్‌ను 'ఈక్వల్ వెయిట్'కు తగ్గించింది. చైనా ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలతో అక్కడి మార్కెట్లు ఊపందుకున్నాయని తెలిపింది. అందువల్ల మదుపర్లు అప్రమత్తంగా ఉండి.. లాభాల స్వీకరణకు మొగ్గుచూపాలని పేర్కొంది.

సేల్స్‌ఫోర్స్‌లో 10 శాతం ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్ : క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్ కంపెనీ సేల్స్‌ఫోర్స్ మరోసారి ఉద్యోగుల తొలగింపునకు పాల్పడింది. ప్రపంచ వ్యాప్తంగా తమకున్న ఉద్యోగుల్లో 10 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. ఏడాది ప్రారంభంలోనూ ఈ సంస్థ 7వేల మంది సిబ్బందిని ఇంటికి పంపించింది. ఈసారి సేల్స్, కస్టమర్ సక్సెస్ టీమ్ సభ్యుల ఉద్యోగాలు ప్రభావితం కానున్నాయని ఆ కంపెనీ వర్గాలు తెలిపాయి. 2024 ఆర్థిక సంవత్సరం చివరినాటికి 8000 మంది ఉద్యోగులను సాగనంపాలని సేల్స్‌ఫోర్స్ ప్రణాళికలు రూపొందించుకున్నట్లు పేర్కొంది.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయండి

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి చైర్మన్ శ్రీధర్‌కుమార్
- ఓయు ఆర్ట్స్ కళాశాల నుంచి పాదయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోధ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జెఎసి ఆధ్వర్యంలో సిద్దిపేట వరకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 80 రోజుల నుంచి విశ్వవిద్యాలయాల్లో ధర్నాలు, పోరాటాలు, సదస్సులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.

అందువల్ల పాదయాత్ర చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. ఈ పాదయాత్ర సిద్దిపేట జిల్లా కోయినపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు కొనసాగుతుందని తెలిపారు. పాదయాత్రకు బయలుదేరిన అధ్యాపకులను పోలీసులు అరెస్టు చేసి ఒయు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జెఎసి వర్కింగ్ చైర్మన్ డాక్టర్ ఎం.రామేశ్వరరావు, చైర్‌పర్సన్ పల్లా రేష్మారెడ్డి, కో చెర్మన్ జరుపుల చందులాల్, ఆర్‌డి ప్రసాద్, డాక్టర్ విజయ్ కుమార్, కె.హరీష్, డాక్టర్ అశోక్ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్, కిరణ్ ప్రేమ్, సుజాత, వాణి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఆర్థిక ప్రణాళికలు రూపొందించాలి

- ప్రతిపక్షాలు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- అప్పుడే మోడీని గద్దె దించగలం
- ఎస్‌వికె వెబినార్‌లో ఆర్థికరంగ విశ్లేషకులు పాపారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న దోపిడీ ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించి, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందని ప్రముఖ ఆర్థికరంగ విశ్లేషకులు డి పాపారావు అభిప్రాయపడ్డారు. ప్రజల్లో వాటిపై చర్చ జరిగితేనే చైతన్యవంతులు అవుతారనీ, ఆ బాధ్యతలను ప్రతిపక్ష రాజకీయపార్టీలు తీసుకోవాలని సూచించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రయివేటు రంగానికి గనులు, ఖనిజాలు పార్లమెంటు ఆమోదం-పర్యవసానాలు' అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. పార్లమెంటులో ప్రతిపక్షాలు మణిపూర్ సంక్షోభంపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న తరుణంలో, దాన్ని అవకాశంగా తీసుకొని కేంద్రం ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నదని తెలిపారు. దేశానికి, దేశ ప్రజలకు అత్యంత ప్రమాదకరమైన లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్పీజీ)ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు. దేశంలో ఇప్పటికే 95 రకాల మినరల్స్ ఉంటే, వాటిని లైసెన్స్‌డ్ కాలంలో సక్రమంగా వినియోగించుకోలేకపోయామనే వాదనలు ఉన్నాయని చెప్పారు. జాతీయ భద్రత కోసం ఈ ఖనిజాలను ప్రభుత్వమే వినియోగించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో బ్యాటరీల తయారీకి విదేశాలపై ఆధారపడకుండా, స్వదేశంలోని ఖనిజాలను వినియోగించుకోవాలని నిర్ణయించారన్నారు. ఇవి ఎంతమాత్రం స్వదేశీ విధానాలు కావన్నారు. పైగా, స్వదేశంలోని చిన్న, మధ్య తరగతి పారిశ్రామికవేత్తలు తీవ్రంగా దెబ్బతిన్నారని విశ్లేషించారు. కేవలం అదానీ, అంబానీలను మాత్రమే పోషిస్తున్నారని చెప్పారు. ఆదానీకి ఆస్ట్రేలియా నుంచి బొగ్గు గనులు ఇప్పించేందుకు స్వయంగా ప్రధానమంత్రే ఎస్‌బిఐ ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆర్థికవనరులు, దేశసంపదను కొద్దిమందికి కొల్లగొట్టి, అప్పగించడం కోసం కేంద్ర ప్రభుత్వం తాపత్రయపడుతున్నదనీ, ఇది అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రయివేటురంగం పర్యావరణాన్ని పట్టించుకోదనీ, దానికి కేవలం లాభాలు మాత్రమే కావాలన్నారు. ప్రపంచం గ్లోబల్ వార్మింగ్ దశ నుంచి గ్లోబల్ బాయిలింగ్ దశకు చేరినట్టు ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని తెలిపారు. దేశంలోకి కొత్తగా ఎలాంటి పరిశ్రమలు, పెట్టుబడులు రావట్లేదని చెప్పారు. ఖనిజ సంపద అధికంగా ఉన్న ఆఫ్రికా దేశాల్లో మైనింగ్ మాఫియా విజృంభిస్తున్నదనీ, ఆకలి, దారిద్ర్యంతో అక్కడి ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. అమెరికా వంటి దేశంలో ప్రస్తుతం మార్కెట్ విధానం వెళ్లిపోయి, పారిశ్రామిక విధానాలు అమల్లోకి వస్తున్నాయనీ, చైనాతో పోటీని తట్టుకొని నిలబడాలంటే అమెరికాకు అది అవసరమని విశ్లేషించారు. ప్రజా సంక్షేమంలో ప్రభుత్వ పాత్ర పెరగాలని అభివృద్ధి చెందిన దేశాల్లో డిమాండ్లు ముందుకొస్తున్నాయని చెప్పారు. సోవియట్ యూనియన్‌లోని లేబర్ ప్లానింగ్ విధానం ఇప్పుడు ప్రపంచానికి అవసరం అనీ, ఆర్థికవేత్తలు దీనిపై దృష్టి పెట్టాలని 'మింట్' పత్రిక పేర్కొందని ఉదహరించారు. కేంద్రం ప్రభుత్వం దేశ సంపదను కొద్దిమంది చేతుల్లో పెట్టి, ప్రజల భవిష్యత్‌ను తాకట్టు పెట్టేలా నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. హిమాలయాల్లో మంచు కరిగిపోయి, తీవ్రమైన పర్యావరణ విఘాతం జరుగుతున్న సమయంలో గనుల్ని ప్రయివేటుకు అప్పగించడం పెను ప్రమాదాలను సూచిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

సున్నం రాజయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

- ఆయన ఆశయ సాధనకు పునరంకితమవుదాం
- రాజయ్య తృతీయ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సున్నం రాజయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, రాజయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మాజీ ఎమ్మెల్యే, ఏజెన్సీ ముద్దుబిడ్డ, అమరజీవి కామ్రేడ్ సున్నం రాజయ్య తృతీయ వర్ధంతి సభ పార్టీ భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన గురువారం చంద్రరావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీతి, నిజాయితీ, నిబద్ధత, నిర్మాణ దక్షిత గల ఆదర్శనీయుడు రాజయ్య అని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు పనిచేసిన రాజయ్య.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరాడంబరంగా జీవించారని తెలిపారు. ఈ నియోజకవర్గానికి సిపిఎం ఎమ్మెల్యేలుగా ముర్ల ఎర్రయ్య రెడ్డి, కుంజా బుజ్జి, సున్నం రాజయ్య చేసిన కృషి మరువలేనిదని చెప్పారు. పట్టణ అభివృద్ధిలో రాజయ్య తనదైన ముద్ర వేశారని అన్నారు. రాజయ్యపై మావోయిస్టులు అనేక సందర్భాల్లో బెదిరింపులకు పాల్పడి, తన కండ్ల ముందే పార్టీ నాయకులు బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావును చంపి, తనకూ అదే గతి పడుతుందని హెచ్చరించినా ఎర్రజెండా దించకుండా ముందుకు సాగిన మహానేత అని కొనియాడారు. విపత్తులు, వరదలు, విష జ్వరాలు, వచ్చి ప్రజలు కష్టాలతో ఉన్నప్పుడు వారికి అండగా ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. తన స్వగ్రామమైన సున్నవారిగూడెంలో తనకున్న 15 ఎకరాల భూమిని స్కూలు, హాస్టల్‌కు దానం చేసి ఆదర్శనీయుడుగా నిలిచారని తెలిపారు. రాజయ్య పోలవరం ముంపు నుంచి భద్రాచలం ప్రాంత రక్షణ కోసం పలుసార్లు పాదయాత్ర నిర్వహించారని, రాష్ట్ర, జిల్లా విభజన సమయంలోనూ ఆమరణ నిరాహార దీక్ష సైతం చేశారని గుర్తు చేశారు. నేడు కరకట్ట నిర్మాణం విషయంలో పోలవరం అంశమే ప్రస్తావించని నిపుణులు కమిటీ నివేదిక తప్పుల తడకగా, పనికిమాలినదిగా ఉన్నదని విమర్శించారు. రాజయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు పదునుపెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లోని సున్నం రాజయ్య స్మారక స్తూపం వద్ద మచ్చ వెంకటేశ్వర్లుతో పాటు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, సున్నం గంగా, పార్టీ సీనియర్ నాయకులు బీబీజీ తిలక్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి బండారు శరత్ బాబు, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆందోళన

- అసెంబ్లీ ముందు ఉద్రిక్తత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై యూత్ కాంగ్రెస్ శుక్రవారం ఆందోళన చేపట్టింది. నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని, ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది.

ఈ క్రమంలో అసెంబ్లీలోకి దూసుకుపోవడానికి యూత్ కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. గన్‌పార్కు వద్ద నడిరోడ్డుపైనే యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. రెండు గ్రూపులుగా వచ్చిన నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు.

అసెంబ్లీ వైపు దూసుకొస్తున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డితో పాటు నగర అధ్యక్షుడు మోటా రోహిత్, ఇతర నేతలను అరెస్టు చేశారు. నిరుద్యోగ భృతి ఇవ్వడంలో, ఉద్యోగాలను భర్తీ చేయడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని వారు ఈ సందర్భంగా విమర్శించారు.

కార్యదర్శి కాళ్లపై పడిన జిపి కార్మికులు

- సమ్మెను నిర్వీర్యం చేయొద్దని వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలో గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో భీమలింగం కాల్వ వద్ద చెత్త పేరుకుపోయింది. గ్రామపంచాయతీ అధికారులు జెసిబి సాయంతో చెత్తను తరలించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్మికులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. పనిని అడ్డుకోవద్దని అధికారులు చెప్పడంతో.. సమ్మెను నిర్వీర్యం చేయొద్దు.. కనికరించండి అంటూ కార్మికులు కార్యదర్శి కాళ్లపై పడి ప్రాధేయపడ్డారు. ఇదే సమయంలో పంచాయతీ అధికారులు మొండిపట్టు వీడాలంటూ కార్మికుడు కొండె నర్సింహా జేసీబీపైకి ఎక్కి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. గమనించిన తోటి కార్మికులు నర్సింహా చేతిలోని పెట్రోల్ బాటిల్ లాక్కుని సర్దిచెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుండాల మండల కేంద్రంలో వీరభద్రుని వేషధారణ, బోనాలతో కార్మికులు నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారిపై గ్రామ పంచాయతీ కార్మికులు వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు.

మోడీ దేశానికి ప్రధానా? గుజరాత్‌కా?

- శాసనమండలిలో అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ దేశానికి ప్రధానమంత్రా? లేక గుజరాత్ రాష్ట్రానికి మాత్రమేనా? అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో అత్యధిక వర్షపాత పర్యవసనాలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై గురువారం శాసనమండలిలో లఘు చర్చను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజరాత్‌లో వరదలొస్తే ప్రధాని మోడీతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అక్కడ పర్యటించారని గుర్తుచేశారు. తెలంగాణలో కూడా వరదలొచ్చాయనీ, కానీ ఇక్కడికి మోడీ రాలేదని తెలిపారు. ప్రధాని ఇక్కడికి రాకపోయినా ఫర్వాలేదు... కానీ సాయం చేయాలని డిమాండ్ చేశారు. సాయం చేస్తే ఆదుకునే చర్యలను ఇక్కడున్న వారు చూసుకుంటారని సూచించారు. రాష్ట్ర విపత్తు సహాయ నిధిలో రూ.800 కోట్లు ఉన్నాయనీ, అందులో కేవలం 10 శాతం అంటే రూ.80 కోట్లు మాత్రమే వాడుకునే వీలుంటుందంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం పదేండ్లుగా తెలంగాణకు ఎలాంటి సాయం చేయకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆయా శాఖల వారీగా వేసిన నష్టాల అంచనాలతో కూడిన నివేదికలో ఏడు శాఖలను మాత్రమే చేర్చారనీ, దానిలో వ్యవసాయ, విద్యాశాఖలను కూడా పొందుపర్చాలని సూచించారు. వరంగల్‌లో యూనివర్సిటీ ప్రక్క నుంచి డ్రెయిన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వర్షపు నీరు వెళ్లే నాలాలపై ఆక్రమణలు ప్రపంచంలో ఎక్కడా లేవనీ, కేవలం ఆ సమస్య మన దగ్గరే ఉందని తెలిపారు. సమీప భవిష్యత్తులో కుంభవృష్టిలు తగ్గే అకాశాలు కనిపించడం లేదని చెప్పారు. హైదరాబాద్‌లో వరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాలు ఏర్పాటు చేయాలనీ, అవసరమైతే ప్రయివేటు ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఖమ్మం మున్నేరు వాగుకు యుద్ధ ప్రాతిపదికన కరకట్టలు నిర్మించాలని కోరారు. మొరంచపల్లి గ్రామానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలవరం పూర్తయితే భద్రాచలానికి ఇంకా కష్టాలు పెరుగుతాయనీ, అక్కడ కరకట్టలు నిర్మించడమా? లేక లోతట్టు ప్రాంతాల వారిని ఎత్తైన ప్రాంతాలకు మార్చడమా? ఏది తక్కువ ఖర్చుతో కూడుకున్నది? తదితర విషయాలను పరిశీలించాలని కోరారు. కరకట్టల నిర్మాణానికి భూసేకరణ కష్టమని నర్సిరెడ్డి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. భారీ వర్షాలతో ఉద్యోగులు కూడా కొంత మేరకు నష్టపోయారనీ, వారి పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తే సాయం చేసినట్టవుతుందని సూచించారు.

రాజకీయ ఎజెండాగా రవాణా రంగం కార్మికుల సమస్య

- అన్ని సంఘాలతోనూ ఒకే వేదిక ఏర్పాటు
- ఆల్ ఇండియా కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రవాణా రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టి రాజకీయ ఎజెండాగా మారుస్తామని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. అన్ని సంఘాలతోనూ ఒకే వేదిక ఏర్పాటు చేస్తామని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో జరిగిన తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మోటార్ వాహన చట్టం-2019 కార్మికులకు తీవ్ర నష్టం చేసే విధంగా ఉందని చెప్పారు. ఈ చట్టాన్ని ఉపసంహరించే వరకు పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అధిక ఫెనాల్టీలు వేస్తూ రవాణా రంగం నుంచి ఒక్కొకరిని తప్పుకునే విధంగా ప్రభుత్వం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అక్టోబర్ 6న దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున పోరాట కార్యక్రమం చేపట్టనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ.. ఈ నెల 8న ట్రాన్స్‌పోర్ట్ ఐక్య కార్యాచరణగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. యాదగిరిగుట్టపైకి ఆటోలకు అనుమతి ఇవ్వాలని 486 రోజులుగా పోరాటం చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. 300 కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు యండి పాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర కుమార్, కోటయ్య, రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులు సాయిలు, పున్నం రవి, రవికుమార్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బిఎసి సమావేశానికి ఆహ్వానంలేదు

- ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమైక్య పాలకులకు ఉన్న సోయి తెలంగాణ పాలకులకు లేదని బిజెపి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. బిఎసి సమావేశానికి బిజెపిని పిలవకపోవడంపై ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఒక్క సభ్యుడు ఉన్నా బిఎసికి పిలిచేవారని, బిజెపి నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు ఉన్నా ఇప్పుడు పిలవడం లేదన్నారు. అసెంబ్లీలో చాలా రూములు ఖాళీగా ఉన్నా.. బిజెపిఎల్పికి గది కేటాయించలేదని చెప్పారు. స్పీకర్‌కు ఫోన్ చేసి అడిగినా జవాబు లేదన్నారు. తాము అసెంబ్లీ ఎదురుగా ఉన్న నిజాం క్లబ్‌లో ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదర వ్యక్తం చేశారు. "సభ మూడు రోజులే జరుగుతుందని అంటున్నారు. రాష్ట్రంలో చాలా సమస్యలు ఉన్నాయి. వాటిపై సభలో చర్చించాల్సిన అవసరం ఉంది. వర్షాలకు పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో కలుపుతామని అంటున్నారు. రోజురోజుకూ ఆర్టీసి బస్సులను ప్రైవేటుపరం చేస్తున్నారు. చాలా మంది ఉద్యోగులను తొలగించారు. ఆర్‌టిసి ఉద్యోగులను మభ్యపెట్టేందుకే విలీన ప్రకటన చేశారు. 18 వేల మంది విఆర్ఎ, విఆర్వోలను వేరే డిపార్ట్‌మెంట్‌కు పంపాలని చూస్తున్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామంటున్నారు. నాలుగేళ్లుగా చేయనిది.. ఈ రెండు నెలల్లో చేస్తారా?" అని ఈటల వ్యాఖ్యానించారు.

భారత మార్కెట్లోకి వెల్‌ఫైర్

- ధర రూ.1.19 కోట్లు

న్యూఢిల్లీ : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) భారత మార్కెట్లోకి తన లగ్జరీ కార్ వెల్‌ఫైర్ ఎంపివిని విడుదల చేసింది. ఇందులో హై గ్రేడ్, విఐపి గ్రేడ్ అనే వేరియంట్లను ఆవిష్కరించింది. గురువారం దీనిని టికెఎం సిఇఒ మసకాజు యోషిమురా, వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్, ఎగ్జిక్యూటివ్ విపి టడసి అసజుమా ఆవిష్కరించారు. ఎక్స్ షోరూం ధరను రూ.1.19 కోట్లుగా నిర్ణయిం చింది. ఎక్స్‌టీరియర్ స్టైలింగ్, మూడు ఇంటీరి యర్ థీమ్‌లతో దీన్ని రూపొందించినట్లు ఆ కంపెనీ తెలిపింది. విఐపి గ్రేడ్ ధరను రూ.1.30 కోట్లుగా ప్రకటించింది. 2.5 లీటర్ 4 సిలిండర్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఇంజన్‌తో ఆవిష్కరించిన ఈ కార్ లీటర్‌కు 19.28 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని వెల్లడించింది. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ కెమెరా, హిల్ అసిస్ట్ కంట్రోల్‌తో పాటు, వెల్‌ఫైర్ లేన్ కీప్ అసిస్ట్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, బ్లైండ్ స్పాట్ మానిటర్, హైబీమ్ అసిస్ట్ వంటి భద్రత ఫీచర్లతో దీన్ని తీసుకొచ్చింది. వచ్చే పండగ సీజన్ నుంచి డెలివరీలను ప్రారంభించనున్నామని ఆ కంపెనీ తెలిపింది.